# 'గర్భ'గుడి

## కావలెను :

కిరాయి గర్భవతి కావలెను. గర్భధారణ, ప్రసవాలలోని కష్టసుఖాలు తెలిసిన స్త్రీ అయివుండాలి. సంపూర్ణ ఆరోగ్యంగా ఉండి, విశాల హృదయం కలిగిన వ్యక్తిగా ఉండాలి. వయసు ముప్పయి ఎనిమిదేళ్లకు మించి ఉండకూడదు. ఇప్పటికే ఒకరిద్దరు బిడ్డలకు తల్లి అయిన స్త్రీకి ప్రాముఖ్యం... బిడ్డ భారాన్ని మోయడానికి అయ్యే ఖర్చులు, వైద్య ఖర్చులు తొమ్మిది నెలలపాటు పూర్తిగా భరిస్తాం. ఇందుకుగాను

అయిదు లక్షల రూపాయల పారితోషికం అందజేస్తాం. పై అర్హతలు కలిగి ఇష్టమైన వారు ఈ కింది ఫోన్ నంబర్లని సంప్రదించండి.

నోట్ : కిరాయి గర్భవతిగా వ్యవహరించిన స్త్రీకి, బిడ్డపై తల్లిగా ఎలాంటి హక్కులు ఉండవు.

xxx xxx xxx

ఆదివారం నాటి పేపర్లో ఓ చోట ఆ ప్రకటన చదివి, విపరీతంగా ఆశ్చర్యపోయాడు రాజేష్. ఒకటికి పదిసార్లు చదివాడు. చదివిన కొద్దీ విస్మయం కలిగింది. ఆ ప్రకటనను సంప్రదించమన్న ఫోన్ నంబర్‌కి డయల్ చేశాడు. ఆవల్నించి ఓ ఆడకంఠం "హలో" అనగానే... "ఈ రోజు పేపర్లో ప్రకటన చదివాను. ఇంకా వివరాలు తెల్సుకుందామని..." అన్నాడు. ఆవతలి కంఠం చాలా కోమలంగా అడిగింది.

"మీరు మీ భార్యని రెంటల్ మదర్‌గా ఒప్పించాలనుకుంటున్నారా?" అని ఆ ప్రశ్నకు ఖంగుతిన్న రాజేష్ నిమిషంసేపు ఆలోచనలో పడి తరవాత "ఎస్... ఐ వాంట్ సమ్ ఇన్‌ఫర్‌మేషన్" అన్నాడు సీరియస్‌గా.

"మేం మధ్యవర్తులం మాత్రమే... మీరూ, మీ భార్య ఒప్పుకుంటే మేం మీ ఇంటికొచ్చి అగ్రిమెంట్స్ చేసుకుంటాం. లక్ష రూపాయలు మాత్రం అడ్వాన్స్ ఇస్తాం. తరువాత ఓ రోజు మీ భార్యని మా హాస్పిటల్‌కి తీసుకొచ్చి ఆమె గర్భాశయంలో అప్పటికే టెస్ట్‌ట్యూబ్‌లో పాదిగిన సూక్ష్మపిండాన్ని ప్రవేశ పెడతాం. తరువాత తొమ్మిది నెలలూ మీరెలా కోరుకుంటే అలా.. అంటే ఇంట్లోగాని, హాస్పిటల్లోగాని ఉంచుతాం. ప్రతిరోజూ మంచి ఆహారాన్నీ పండ్లని ఇస్తాం. మెడికల్ అబ్జర్వేషన్‌లో ఉంచి డెలివరీకి ముందు హాస్పిటల్‌లో జాయిన్ చేస్తాం. మీ భార్య

బిడ్డని కని మా చేతుల్లో పెట్టగానే, మిగతా నాలుగు లక్షలూ మేం మీ చేతుల్లో పెడతాం..." అంది.

"మరి ఆ బిడ్డ తల్లిదండ్రులు...?"

"అవన్నీ సీక్రెట్... ఆ బిడ్డ ఎవరికోసమో మీకు తెలీకూడదు. తొమ్మిది నెలలు మోసి ఎవరు కనిచ్చారో వాళ్లకీ తెలియకూడదు..."

"తెలిస్తే... ఏమవుతుంది?"

"చాలా ప్రమాదాలు జరగొచ్చు. అవన్నీ మీరే ఊహించుకోండి. ఈ నిబంధనలు ఓకే అనుకుంటే మీ ఇష్టం..."

"మేడమ్... ఇలాంటి వాటికి ఎవరైనా ముందుకొస్తారంటారా...?"

"టైం వేస్ట్ చేయకండి... పేపర్‌లో వచ్చిన ఈ గంటన్నరలోనే మీది మూడువందల నలభై రెండో కాల్" అని ఫోన్ పెట్టేసింది.

రాజేష్ ఉలిక్కిపడ్డాడు... తనది మూడువందల నలభై రెండో కాలా...?

"ఏంటండీ.. పేపర్ చదవటం మానేసి... ఫోన్స్ చేస్తూ కూచున్నారు. ఇంత పొద్దున్నే ఎవరికీ..." కాఫీ అందిస్తూ అంది సువర్చల. రాజేష్ మొహంలో కొద్దిగా కలవరపాటు... సువర్చల మొహంలోకి సూటిగా చూడలేకపోయాడు.

కాఫీ తాగుతూ, దీర్ఘాలోచనలో మునిగిపోయాడు రాజేష్.

సువర్చల పేపర్ తిరగేయటం మొదలెట్టింది. ఆ ప్రకటన సువర్చల కంటపడాలని కాఫీ తాగుతూనే ఓరకంట గమనిస్తున్నాడు. ఆ నిశ్శబ్దాన్ని డిస్టర్బ్ చేస్తూ బాత్రూంలోంచి బంటీగాడు ఒకటే అరుస్తున్నాడు.

"మమ్మీ... లెట్రిన్ కడుగుదువ్ రావే... మమ్మీ..."

సువర్చల పేపర్ పక్కన పడేసి ఎక్కడ వెళ్తుందోనన్న భయంతో... చటుక్కున తనే లేచి వెళ్లాడు.

బాత్రూంలో వాణ్ణి ఆడిస్తూ పాడిస్తూ పావుగంట గడిపాడు. వాడికి నిక్కరు వేసి తిరిగొచ్చేసరికి సువర్చల ముఖం చిన్నబోయి ఉంది.

"ఏమైంది సువర్చలా... అలా అయిపోయావు?" అన్నాడు ప్రేమగా

"ఏమండీ... పేపర్లో ఓ నీచమైన ప్రకటన పడింది. చదివారా?"

"ఏమిటది... రెంటల్ మదర్యాడా... దాంట్లో నీచమైంది ఏముంది? భగవంతుడెప్పుడో అలాంటి పనిలో తప్పులేదని తేల్చిచెప్పాడు కదా..."

"భగవంతుడా... ఎలా?" అడిగింది సువర్చల.

"కోకిల గుడ్లు పెట్టి కాకి చేత పొదిగించుకుంటుంది. అదిప్పుడు మనుషులకు మొదలైంది. అంతే! నాకైతే దాంట్లో తప్పేమీ కనిపించట్లేదు" అన్నాడు.

రాజేష్ సమర్థించడంతో... సువర్చల నివ్వెరపోయింది.

XXX XXX XXX

భోజనాల దగ్గర కూడా... అదే విషయాన్ని సువర్చల ఆలోచిస్తోందని పసిగట్టిన రాజేష్...

"అయిదు లక్షలు.. ఎవరో ఆ అదృష్టవంతులు..." అన్నాడు.

కనురెప్పలు పైకెత్తి చివ్వున చూసింది సువర్చల.

"మనకో బాబు పుట్టడంతో ఆ లోటు ఏంటో తెలీటం లేదు. పాపం

పిల్లలు లేని వాళ్ళ మానసిక సంఘర్షణ చాలా దారుణం కదూ..." జాలిగా అన్నాడు.

"పాము పుట్టలదగ్గరో, స్వాముల దగ్గరో... సంతానలేమి వాళ్లను చూస్తే బాధ కలుగుతుంది." అన్నాడు మళ్లీ.

"ఇప్పటికే ప్రభుత్వం అసిస్టెడ్ రిప్రొడక్టివ్ టెక్నిక్ పేరుతో సహాయ పునరుత్పత్తి విధానాన్ని చట్టబద్ధం చేసింది. రేపోమాపో గర్భాన్ని అరువిచ్చే ముసాయిదా బిల్లుని తీసుకొచ్చేలా ఉంది.." సువర్చల ఫీలింగ్స్‌ని గమనిస్తూ నెమ్మదిగా అన్నాడు మళ్లీ.

"పోనీలెండి... దరిద్రపు విషయాలు..." అన్నది అన్నం సయించక చేయి కడుక్కొని లేచింది.

"అయిదులక్షలంటే మాటలా? మన లాంటి వాళ్లం ఎన్నాళ్లు కష్టపడితే వస్తాయ్...?"

"అంటే...? అనుమానంగా అడిగింది.

"ను...వ్వొ...ప్పు...కుం...టే... మనమూ అప్లయ్ చేద్దాం..."

మాటలు కూడబలుక్కున్నట్టే అనేసి సువర్చల వైపు చూడకుండానే చేయి కడుక్కొని లేచి బయటికెళ్లిపోయాడు.

సువర్చల నోరు తెరిచి అలాగే ఉండిపోయింది. భర్త ఆలోచనకి...

తరువాత కంపించి పోయింది.

అసహ్యంతో కదిలిపోయింది.

××× ××× ×××

ఆరోజు రాత్రి...

బంటీ నిద్రపోయాడు...

"అయిదు లక్షలు జీవితంలో ఎలా సంపాదించగలం? నువ్వే చెప్పు?"

"అందుకోసం ఇలాంటి దిక్కుమాలిన పనులు చేయాలా?" దుఃఖం, ఉక్రోషం కలగలిపి వచ్చాయి.

"అందులో తప్పేం లేదు"

"ఏం తప్పులేదు..? ఈరోజు ఇలా బిడ్డని కనివ్వమంటారు. రేపెవరైనా పదిలక్షలిస్తామంటే డైరెక్కుగానే కనివ్వమంటారు... ఛీ... చీ... మీలో ఇంత నీచమైన ఆలోచనలు ఉన్నాయనుకోలేదు.." సువర్చల కళ్లు ఎర్రబడ్డాయి.

"నువ్వెందుకంత సీరియస్‌గా తీసుకుంటున్నావో అర్థం కావట్లేదు. నా జీతం అంతంత మాత్రమే. రేపు బంటీ గాడికి మంచి భవిష్యత్తు ఉండాలనుకుంటే... కనీసం మనదగ్గర అయిదారు లక్షలైనా ఉండాలి. నిదానంగా ఆలోచించు.. అంతేకాని అదేదో దుర్మార్గపు పని అనుకోకు... అన్ని లక్షల డబ్బొస్తుందంటే... ఆ మాత్రం రిస్క్ తీసుకోక తప్పదు. బతిమాలినట్టుగా అన్నాడు రాజేష్.

"ఎవరికైనా తెలిస్తే నవ్విపోతారు. నలుగురిలో తలెత్తుకు తిరగ్గలమా? మన బంధువర్గాల్లో ఈ విషయం తెలిస్తే నన్నో వింత జంతువుని చూసినట్టుగా చూస్తారు తెల్సా?"

"జనం గురించి పట్టించుకోకు.. ఒక రోజు అనుకుంటారు మర్నాడు మర్చిపోతారు. కాని అయిదులక్షలొస్తే బంటీగాడి పేరు మీద ఫిక్స్‌డ్ చేద్దాం. వాడి భవిష్యత్తు గురించి ఆలోచించవేంటి?" అన్నాడు సీరియస్‌గా.

సువర్చల మనసు అల్లకల్లోలమైపోతోంది. గుండెనెవరో పిండేసినట్లవుతోంది. కడుపులో పేగులు భయంతో లుంగచుట్టుకున్నట్లవుతోంది... బాధగా బంటీవైపు చూసింది...

నిష్కల్మషంగా... నిద్రపోతున్న వాడి మోము చూడగానే, కన్నీళ్లు జలజలా రాలిపడ్డాయి.

డబ్బు...

మనిషిలో ఎన్ని ఆలోచల్ని సృష్టిస్తోంది...?

ఎన్ని సుడిగుండాల్ని తిప్పుతోంది...?

నిన్నటి వరకూ సాఫీగా సాగుతున్న తమ కుటుంబంలో ఒక్క ప్రకటన ఎంతటి కలవరం రేపుతోంది....? గర్భాశయాన్ని తాకట్టు పెట్టుకోవటమంటే, వివాహవ్యవస్థనూ, మాతృ వ్యవస్థనూ కించపరిచినట్టు కాదా...? వీటికి ఇంకా చట్టాలు... ముసాయిదాలు... ఆమోదాలు...

ఛీ...

నా తల్లి, నా తండ్రి, నా పిల్లలు అనే భావం లేకుండా పోతున్న కుటుంబ వ్యవస్థ ఈ ప్రయోగాలతో పూర్తిగా విచ్ఛిన్నం కానుందా...? డబ్బుతో మగాడు రాజీపడితే ఆడదే అన్ని విధాలా నలిగిపోతోంది.

సువర్చల మెదణ్ణి కెరటాల్లా ఢీకొంటున్న ఆలోచనలు... మనసంతా చీకటి ఆవరిస్తున్న భయం... అయినా అన్ని అణిచిపెట్టుకొని...

"ఆ విషయం మర్చిపోండి... రండి అన్నం తిందాం" అంది.

"నాకు ఆకలిగా లేదు. నువ్వెళ్లి తిను" అన్నాడు సీరియస్‌గా.

"అన్నం తినడానికీ ఆ విషయానికి సంబంధం ఏమిటి? రండి" అంది.

"నాకవసరం లేదన్నానా?" రాజేష్ మొహంలో తీవ్రమైన కోపం.

"ప్లీజ్... రండి..."

"నాకవసరం లేదు." అరచినంతగా అన్నాడు. ఆ అరుపుకి ఉలిక్కి పడి లేచిన బంటీ ఏడుపు అందుకున్నాడు. వాణ్ణి చప్పున దగ్గర తీసుకొని గుండెలకు హత్తుకొని నిశ్శబ్దంగా ఏడుస్తూ పడుకుంది సువర్చల...

అలా మూడ్రోజులూ...

ఆ ఇంట్లో మౌనంగా చుట్టుముట్టిన తుఫాను. తీవ్ర అలజడిని సృష్టించింది... నిర్జల మేఘాలు నిశ్శబ్దంగా గర్జించాయి. కన్నీటి తరంగాలు కడలిలా ఘోషించాయి. తల్లిపేగులు ప్రయోగాల పేర దిగజార్చిన సైన్సుని దూషించాయి.

మాతృత్వం శపించినా... డబ్బు శాసించింది...

ఫలితంగా... ఆరో రోజున సువర్చల మరబొమ్మలా తలూపింది.

xxx xxx xxx

టెస్ట్‌ట్యూబ్‌లో పాదిగిన సూక్ష్మపిండం, సువర్చల గర్భంలో ప్రవేశపెట్టారు. అగ్రిమెంట్ల మీద సంతకాలయ్యాక, లక్ష రూపాయలిచ్చారు. ఆ పిండం ఎవరిదో వాళ్ళు కన్పించలేదు. పుట్టబోయే బిడ్డని తీసుకునేవాళ్లెవరో కూడా కన్పించలేదు. అంతా డాక్టర్లే చూసుకుంటున్నారు. ఇంటిలోనే ఉంటాననటంతో సువర్చలని డిశ్చార్జి చేశారు.

ఆ రోజు నుంచీ కడుపులో పిండం పెరుగుతుంటే... సువర్చల మనసుని రకరకాల అనుభూతులు చుట్టుముట్టేవి.

బంటీ... నీకు చెల్లాయో, తమ్ముడో పుట్టబోతున్నార్రా కన్నా... అని కూడా చెప్పుకోలేని విచిత్రమైన వ్యధ నులిపెట్టేది.

పొత్తికడుపు మీద ఆప్యాయంగా నిమురుకోవాలన్నా... ఏదో భయం. బంటీగాడు కడుపులో ఉన్నప్పుడు... ఆయన కడుపు దగ్గర చెవిపెట్టి ఏదో మాట్లాడి గిలిగింతలు పెట్టేవాడు. కానిప్పుడు తొమ్మదినెలలు తొందరగా గడిస్తే బావుండేది అన్నట్టుంది రాజేష్ మనస్తత్వం.

వీధిలోకెళ్లాలన్నా, షాపింగ్ కెళ్లాలన్నా, ఫంక్షన్‌లకెళ్లాలన్నా అందరి చూపులూ తన గర్భంమీదే ఉన్నాయేమోనన్న భయం..."

ఓ రోజు ఇంజక్షన్ ఇవ్వడానికొచ్చిన నర్స్‌ని అడిగింది.

"ఈ బిడ్డ తల్లిదండ్రులెవరు?"

"తండ్రి ఒక్కరేకాని... తల్లులిద్దరు.. ఒకావిడ అండాలిచ్చిన తల్లి. రెండోది మీరు... అంటే నవమాసాలు మోసే తల్లి... మీరొక్కరే మాకు తెల్సు... వాళ్లిద్దరూ భార్యాభర్తలో కాదో, వేరే వేరే వ్యక్తులో కూడా మాకు తెలీదు. మాలో ఒక డాక్టర్‌కి తప్ప..." అంది.

"ఈ బిడ్డ నాదే అంటే ఏమంటారు?" అంది సువర్చల.

"మేమేమీ అనం.. మీ ఆయనే మిమ్మల్ని చంపేస్తారు" అంది నవ్వుతూ, ఆ నవ్వు ఎగతాళిలా తోచింది.

నర్స్ వెళ్లిపోతూ "ఇప్పుడు ఏడో నెల... జాగర్తగా ఉండండి. మళ్లీ రేపొచ్చి

చెకప్ చేస్తాను. మీ బీపీ రకరకాలుగా ఉంటోంది." అనేసి వెళ్లిపోయింది.

సువర్చలకి ఏం చేయాలో తోచక అల్బం తీసింది.

అన్నీ పెళ్ళి ఫోటోలే...

కలశం మీద చేయిపెట్టి ప్రమాణం చేయిస్తున్న ఫోటో దగ్గర కన్నీళ్ళతో ఆగిపోయింది.

"అర్థేచా... కాదు

ఆర్థికేచా... అనండి

మోక్షేచా .... కాదు రాక్షేచా... అనండి

కామేచా.... కాదు కష్టేచా... అనండి.

ధర్మేచా.... కాదు, దండనేచా.... అనండి, నాతి చరామి... కాదు నాతి'చెరా'మి... అనండి. పెళ్ళి మంత్రాలు మార్చండి" అని అరవాలన్పించింది. కానీ...

సువర్చలకి కడుపులో పిండం కాళ్లతో తన్నినట్లయింది. మనసులో ఏదో గిలిగింతలు... గుండెల్నిండా ఏదో హాయి... ఆర్తిగా ప్రేమగా కడుపు నిమురుకుంది...

"అ...మ్మా..."

ఎక్కణ్ణించో లోతుల్లోంచి... లోయల్లోంచి చిన్నారి పిలుపు...

ఉలిక్కిపడి చేయి తీసేసింది.

అంతా నిశ్శబ్దం...

కడుపులో పిండం పిలిచిందా... ఏదో అనుమానం... ఏమిటీ వెర్రితనం పిండం మాట్లాడటం ఏంటీ అనుకొని మళ్లీ ప్రేమగా చెయ్యేసింది.

"అమ్మా"

స్పర్శలోంచి... నాడుల్లోంచి... నరాల్లోంచి... మనసుని తాకుతున్న పిలుపు... ఈసారి చేయి తీయాలనిపించలేదు.

ఆ చిన్నారి పిలుపులో ఏదో దుఃఖం... సుడులు తిరిగే వేదన... ధమనుల్లోంచి, సిరల్లోంచి పొంగిపొర్లే రక్తమంతా కదిలిపోయి కన్నీరైంది. ఆ పిలుపుకి...

"అమ్మా...

నీ కడుపులోనే మొగ్గ తొడిగిన నిమిషాన ఈ ప్రపంచమొక మాయా జూదమని తెలిసినా బాధపల్లేదు. నువ్వొక కిరాయి తల్లివని తెలిశాక, అమ్మ ప్రేమ మీద అభిమానం పోయింది..."

సువర్చల చప్పున చేయి తీసింది.

ఏంటీ? పిండం మాట్లాడుతోందా?

లేక తనే భ్రమపడుతోందా?

తన కిరాయి గర్భం మీద అసహ్యమేసి తల్లిప్రేమనే ఈసడించు కుంటోందా? కాసేపటికి భయంభయంగా మళ్లీ గర్భం మీద చేయ్యేసింది.

"...పురుడుతోనే అనామకుణ్ణాయి అమ్మా అని కడుపులోంచి అరచినా విన్పించుకోని నీ కఠినపు గుండె శిలల మీద నరాలతో ఉరిపోసుకోవాలనుంది.

కాని... సృష్టిలో అపురూపమైన అమ్మ తనాన్ని అగ్రిమెంట్ల మీద తాకట్టు పెట్టి... మాతృత్వ వ్యాపారానికి శ్రీకారం చుట్టిన నీకు చాలా నష్టం కదూ..."

భయంగా చప్పున చేయి తీసేసింది. సువర్చల.

బిడ్డకి చనిపోవాలనుందా...?

తనది మాతృత్వ వ్యాపారమా...?

సువర్చలలోని తల్లిగుండె విలవిలలాడింది ఆ మాటకి... మరోసారి చేయి వేసుకుంది.

"అమ్మా...

నాకు చచ్చిపోవాలనుంది... వివాహ వ్యవస్థను వెక్కిరిస్తూ పుట్టుకొచ్చే మేమంతా పెరిగి పెద్దయ్యాక అనుభవించే క్షోభ గుర్తొస్తే చచ్చిపోవాలనుంది... కానీ నీకు నష్టం కదూ... నా రాక కోసం రహస్య డాక్యుమెంట్లని లాకర్లలో దాచారేమోగాని... నీ గర్భాన్ని దాచలేవు కదా! నన్ను కని, ఎవరి చేతుల్లోనో పెట్టేసి నువ్వింటికెళ్తే అందరూ అడిగితే ఏం చెప్తావ్? ఆస్పత్రిలోనే బిడ్డ చచ్చిపోయిందనా... అందుకే నాకు చచ్చిపోవాలనుంది.. కానీ నీకు నాలుగు లక్షలు నష్టం కదూ..."

సువర్చల గుండె చిట్లిపోయింది.

"మాతృదేవోభవ అని మొక్కాల్సిన నా మట్టివేళ్లు ముడుచుకుపోతున్నాయి. నీ జోలపాట వినాలని ఆరాటపడే నా చిన్ని మనసు మూగవోతోంది... నేనెక్కడ పెరుగుతానో... అన్న ఊహే భయంకరమై, పాలకోసం నీ స్తన్యాన్ని తాకకముందే అస్తమించాలని ఉంది... కానీ నీకెంత నష్టం?

అమ్మా... నీకోసమైనా బతకాలని ఉంది. అయిదు లక్షలతో వచ్చే

ఆడంబరాల మధ్య మర్చిపోతావేమోకాని... ఎప్పుడైనా చప్పున గుర్తొస్తే... నా కోసం ఓ కన్నీటి బొట్టురాల్చు.. అమ్మ ప్రేమ మీద ఆవగింజంతయినా నమ్మకాన్ని మిగుల్చు..." సువర్చల కదిలిపోయింది... కంపించిపోయింది... కన్నీటి సంద్రమైపోయింది...

"నా తప్పేమి లేదురా కన్నా... నా కడుపును వ్యాపార వస్తువుగా మార్చాడే, అతడు... వరకట్నం నించి మొదలు బతుకంతా పీల్చినవాడు... స్కానింగుల్లో ఆడపిల్లని తేలినప్పుడల్లా అబార్షన్ పిల్స్ మింగించినవాడు. డబ్బు సంచుల కోసం ఇంటిముందు గర్భసంచి కిరాయికివ్వబడును అనే బోర్డు తగిలించాలనిచూస్తున్నవాడు... అతణ్ణి శపించరా... ఈ అమ్మ అప్పుడూ.. ఇప్పుడూ... ఎప్పుడూ మారలేదురా..." సువర్చలకి అనుకోకుండా నొప్పులు మొదలయ్యాయి. రాజేష్ హాస్పిటల్‌కి ఫోన్ చేశాడు.

అంబులెన్స్‌లో తరలించాక, అందరికన్న ఎక్కువ సంతోషించింది రాజేషే... రెండు నెలల ముందే బిడ్డ పుట్టబోతోందని...

ఆపరేషన్ థియేటర్ బయట బంటీని పట్టుకొని టెన్షన్‌గా నిల్చున్నాడు. బంటీకి అయోమయంగా ఉంది.

అమాయకంగా... బెరుకుగా హాస్పిటలంతా కలియజూస్తున్నాడు.

గంట తరువాత ఇద్దరు నర్సులు పసిగుడ్డుని ముద్దాడుతూ తీసికెళ్లిపోయారు. ఎవరో వ్యక్తి వచ్చి రాజేష్ చేతిలో నాలుగు లక్షలు పెట్టి కొన్ని కాగితాల మీద సంతకాలు తీసుకొని పోయాడు.

రాజేష్ డబ్బుని సంతృప్తిగా చూసుకున్నాడు. బంటీని ముద్దుపెట్టుకుంటుంటే డాక్టర్ బయటికొచ్చి "మిస్టర్ రాజేష్..." అని పిలిచాడు.

"థాంక్యూ డాక్టర్" అన్నాడు కృతజ్ఞతగా.

"మగబిడ్డ... ఆరోగ్యంగా పుట్టింది. కాకపోతే ఓవేరియన్ హైపర్ స్టిమ్యులేషన్ సిండ్రోమ్ అనే సమస్యతో సువర్చలకి ప్రసవ సమయంలో శ్వాస కష్టమయింది..."

"ఇప్పుడెలా ఉంది డాక్టర్..."

"అయాం సారీ... మీ భార్య చనిపోయింది..."

ఆ మాట విని... రాజేష్ కాళ్లకింది భూమి కదలిపోయింది.

"సారీ... ప్రసూతి సమయంలో రెంటల్ మదర్ చనిపోతే ఎలా? అలా జరిగితే మరో పదిలక్షల నష్ట పరిహారమైనా ఇవ్వాలా? అనే విషయం మనకి తట్టలేదు... అందుకే అగ్రిమెంట్‌లో కూడా రాసుకోలేదు..." బాధగా రాజేష్ భుజం తట్టాడు.

రాజేష్ ఆందోళనగా తన చేతిలోని నాలుగులక్షలు డాక్టర్ చేతిలో పెట్టాడు.

"డాక్టర్... నాకు నా భార్య కావాలి... నాకు నా సువర్చల కావాలి..." డాక్టర్ ఆ డబ్బుని తిరిగి రాజేష్ చేతిలో పెట్టాడు.

"వెరీ సారీ... అయాం వెరీ సారీ..." అని వెళ్లిపోయాడు.

సువర్చల శవం మార్చురీకి తరలిపోతుంటే, కంఠనాళాలు తెగిపోయేలా బంటీని పట్టుకొని బావురుమన్న రాజేష్ దుఃఖం హాస్పిటల్ గోడల్ని తాకి పగిలిపోతోంది.

*